# హైదరాబాద్ వార్త



## రైల్వే స్టేషన్లలో చోరీలు

### ఇద్దరు నిందితుల అరెస్టు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: రైల్వే స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే డిఎస్‌పి నర్సయ్య సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ రియాజ్ (22) వృత్తి రీత్య కులీ, మద్దం శ్రవంతి అలియాస్ నిఖిత, షేక్ సోనీ (20) అనే భార్య భర్తలిద్దరు జలాసలకు పాల్పడుతూ రైల్వే స్టేషన్లలో మహిళా ప్రయాణికులను టార్గెట్ చేస్తూ బంగారం, వెండి అభరణాలను చోరీ చేస్తున్నారు. వీరిపై గతంలో రెండు కేసులు కూడా నమోదైయ్యాయి. తప్పించుకు తిరుగుతున్న వీరిద్దరు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1వ ఫ్లాట్ ఫారంపై సంచరిస్తుండగా అనుమానస్పందంగా ఎస్ఐ మజీద్ పట్టుకొని విచారించగా గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 114 గ్రాముల బంగారు అభరణాలు, 10 గ్రాముల వెండి అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప పాల్గొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి తెలిపారు.

## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

### ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

### గుర్తు తెలియని మృతదేహంపై వీడిన మిస్టరీ

### ముగ్గురు నిందితులు అరెస్టు

నేరేడ్‌మెట్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఇటీవల జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీలో గుర్తు తెలియని మృతదేహంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యగా పరిగణించి నిందితులను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం బాలాజీనగర్ మాతృశ్రీ కాలనీకి చెందిన సందిరి స్వామి (35) డ్రైవర్‌గా పని చేస్తూ భార్యతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో స్వామి భార్య సందిరి కావ్యకు ఇంటి ఎదురుగా ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ విషయం గమనించిన స్వామి పలుమార్లు వారిని హెచ్చరించడంతో స్వామి అడ్డును తొలగించుకోవాలని నిర్ణయించుకున్న కావ్య, ప్రణయ్ కుమార్‌తో కలసి పథకం నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ప్రణయ్ కుమార్ ఇద్దరు వ్యక్తులతో కలసి నిజామాబాద్‌కు వెళ్ళాలని చెప్పగా అందరితో కలసి స్వామి కూడా వెళ్ళాడు. తిరిగి రాత్రి 11గంటల సమయంలో ప్రణయ్ అప్పటికే తెచ్చుకున్న కత్తితో స్వామిపై దాడి చేయగా చనిపోయాడు. దీంతో 27వ తేదీనా ఉదయం సమయంలో కారు డిక్కీలో స్వామి మృతదేహాన్ని వికలాంగుల కాలనీ వెనుకవైపు తీసుకు వచ్చి పెట్రోల్ పోసి నిప్పు అంటించి వెళ్ళిపోయారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని పోలీసులకు అనుమానం రావడంతో నూతనంగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు కేసు విచారణ చేపట్టారు. దీంతో పథకం ప్రకారమే హత్య చేసినట్లు విచారణలో తేలడంతో మృతుడి భార్యతో పాటు అమెకు సహకరించిన ముగ్గురు నిందితులైన కమల ప్రణయ్ కుమార్ అలియస్ ప్రణయ్ (26), పాసులోటి రోహిత్ (23), మబ్బు నరేష్ (25)లను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లు, పెట్రోల్ డబ్బాను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసులను రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు అభినందించారు.

## సమాచార, పౌరసంబంధాల శాఖకు మంచి పేరు తీసుకురండి

### సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: సమాచార, పౌరసంబంధాల శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావడానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆ శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సమాచార పౌరసంబంధాల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆ శాఖ అదనపు సంచాలకులు( ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) కిషోర్‌బాబు, సంయుక్త సంచాలకులు డిఎస్.జగన్, డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, ఎన్.వెంకటేశ్వర రావు, ముర్తూజ, రాధాకిషన్, సిఇఇ, ఉపసంచాలకులఉ ఎస్ఎ.హాష్మీ, ఎం.మధుసూదన్, వై.వెంకటేశ్వర్లు, సమాచార శాఖ సిబ్బంది సమక్షంలో జరిగింది. క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలో సమాచార శాఖ ప్రాముఖ్యత ఎంతో ఉంటుందని, ఉద్యోగుల విధి నిర్వహణ, బాధ్యతలు ఎంతో విలువైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డి.జితేందర్, కార్యదర్శి కె.అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు జి.శ్రీలతాదేవి, ఉన్మేష్ బాజ్పేయ్, సంయుక్త కార్యదర్శులు ఎం.మీనాక్షి, ఆర్.నరేశ్, సి.నాగరాజు, ప్రచార కార్యదర్శి వి.ఇందిర, కార్యనిర్వాహక కార్యదర్శి పి.రాజు, కార్యవర్గసభ్యులు ఎస్.సంగీత, టి.స్వర్ణలత, ఎన్.రాజ్‌కుమార్, ఎం.ఎ.మజీద్ పాల్గొన్నారు.

## తెలంగాణ హిందీ ప్రచార సభ నూతన అధ్యక్షుడిగా కె.రామచందర్ ఎన్నిక

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తెలంగాణ హిందీ ప్రచార సభ నూతన అధ్యక్షుడిగా కె.రామచందర్, కార్యదర్శిగా ఎ.కె.రాజు ఎన్నికైనారు.ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంయుక్త కార్యదర్శి కాల్వ సరిత, కోశాధికారిగా రామ్మోహనాచార్యులు, పరీక్షా సంచాలకులుగా మల్లారెడ్డి, ప్రచార సంచాలకులుగా శ్యామ్‌సుందర్, కార్యవర్గ సభ్యులుగా విజయ్‌వాగ్మోడే, రవి, ప్రతిభా మెహర్, దినేష్ ఆర్యలు ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడే, ప్రధాన కార్యదర్శి గైబువల్లి, పరీక్షా సంచాలకులు ప్రొఫెసర్ సురేష్‌పురి తదితరులు ఘనంగా సత్కరించారు.

## సినీనటుడు సాయికుమార్‌కు 'కళాతపస్వీ విశ్వనాథ్ జీవితసాఫల్య పురస్కారం'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఆనందభైరవి సాంస్కృతిక, సామాజిక సంస్థ అధినేత, ప్రముఖ అంతర్జాతీయ గాయనీ, నేపథ్యగాయనీ శారదాసాయి ఆధ్వర్యంలో 6న ప్రముఖ సినీనటుడు సాయికుమార్‌కు 'కళాతపస్వీ విశ్వనాథ్ జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఆ జరిగే ఈ కార్యక్రమంలో నేపథ్య గాయనీ గాయకులు, నంది అవార్డు గ్రహీతలు డి.సురేఖామూర్తికి ఎస్.జానకీ అవార్డు, వినోద్‌బాబుకు డాక్టర్ ఎస్పీబాలు అవార్డు, రాగా ఎస్టేట్స్ చైర్మన్ కె.రాగమయిలకు 'సేవారత్న' అవార్డులను బహుకరించనున్నారు. వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రత్యేక ముఖ్యఅతిథిగా సుచిర్ ఇండియా గ్రూప్ అధినేత డాక్టర్ కిరణ్, సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు, న్యాయవాది సోమంచి వెంకటేశ్వర్లు, గాయకుడు ఎల్.ఆనందమోహన్ తదితరులు పాల్గొంటారు.

## కనెక్షన్లు ఎన్ని.. ఎంతభారం?



### ఉచిత విద్యుత్‌పై డిస్కం అధికారుల కసరత్తు

### 200యూనిట్లలోపు 28-30లక్షల కనెక్షన్లు ఉన్నట్లు గుర్తింపు

### విధి విధానాలకోసం ప్రత్యేపోర్టల్ ఏర్పాటు చేసే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త: ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమలుపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ టిఎస్‌పిఎస్సీ కసరత్తు మొదలుపెట్టింది. గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ కనెక్షన్లలో ఎన్ని కనెక్షన్లు 200లోపు ఉన్నాయి.. ఎంత భారం పడుతుందనే లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే కర్నాటకలో ఈపథకం అమలు చేస్తున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ఉన్నతాధకారులు సమగ్ర నివేదికలు సిద్దం చేస్తున్నారు. గృహజ్యోతి అమలు చేస్తే తలెత్తే సాంకేతిక సమస్యలు, ఉచిత విద్యుత్‌తో పెరిగే డిమాండ్, క్షేత్రస్తాయిలో విద్యుత్‌శాఖ తీసుకోవాల్సిన చర్యలపై కార్యచరణ రూపొందిస్తున్నారు. ఈనేపథ్యంలో కర్ణాటక తరహాలోనే గృహజ్యోతి పథకం అమలుకు ఒప్రత్యేక పోర్టల్ అందుబాబుట లోకి తెచ్చేఅవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే గ్రేటర్‌లో 52లక్షలు గృహవిద్యుత్ వినియోగదారులు ఉంటే దాదాపు 30లక్షల కనెక్షన్లు 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నారు. కానీ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలల్లో భాగంగా తీసుకున్న అప్లికేషన్లలో 19.85లక్షలమందే దరఖాస్తు చేసుకున్నారు. అందుకు కారణం అద్దె ఇళ్లలో ఉంటున్న లక్షలమంది దరఖాస్తు చేసుకోకపోవడం, విద్యుత్‌పై ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంతో దరఖాస్తుల సంఖ్య తక్కువగా వచ్చినట్లు తెలుస్తుంది. డిస్కం పరిధిలో 20సర్కిళ్లు ఉండగా గ్రేటర్ పరిధిలో 9 సర్కిళ్లు ఉన్నాయి. ఈనేపథ్యంలో డిస్కం కు వచ్చే అదాయం అత్యధికంగా గ్రేటర్ నుంచే వస్తుంది. గృహజ్యోతి అమలైతే సుమారు 25లక్షల వినియోగదారులకు లబ్ది చేకూరే అవకాశం ఉంది. గ్రేటర్‌లోని 9సర్కిళ్లనుంచి గృహ, కమర్షియల్,హెచ్‌టి కేటగిరీలకింద ప్రతినెలా 900-1200కోట్ల విద్యుత్ బిల్లులు వసూలవుతుంటాయి. అందులో 65-70శాతం కమర్షియల్, హెచ్‌టి కనెక్షన్ల ద్వారా వస్తుంది. ఈకారణంగా గృహజ్యోతి అమల్లోకి తెచ్చినా భారీనష్టాలు వచ్చే అవకాశం తక్కువేనని ఉన్నతాధికారులు అంటున్నారు. పైగా గృహజ్యోతితో విద్యుత్ చౌర్యం నివారించడంతోపాటు ప్రతియూనిట్ విద్యుత్ బిల్లుపరిధిలోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం గృహజ్యోతి విద్యుత్ బిల్లులను ప్రతినెలా విద్యుత్ సంస్థలకు చెల్లిసేనత ఆర్థికంగా కొంత నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని విద్యుత్‌రంగ నిపుణులు తెలుపుతున్నారు.

#### కర్నాటక తరహాలో విధి విధానాలు

కర్ణాటకలో గృహజ్యోతి పథ కంలో భాగంగా ప్రతికనెక్షన్‌కు 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. అందుకు విధివిధానాలను గతంలో వినియోగదారుడు ప్రతినెలా ఎంత విద్యుత్ వినియోగించాడో గుర్తించి దానికి మరో 1520శాతం అదనంగా వాడే వెసులబాటు కల్పిస్తున్నారు. అలాగే దరఖాస్తుదారుడు ఏడాదిపాటు ఆరాష్ట్రంలో ఉన్నాడా లేదా అనేది చూస్తున్నారు. అలాగే కుటుంబంలో ఒకసభ్యుల్లో ఒక్కరికి మాత్రమే అవకాశం ఇస్తున్నారు.అలాగే 200యూనిట్లకంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే దానికి యూనిట్ ప్రకారం చార్జీలు విధిస్తున్నారు. అలాగే గృహజ్యోతి అమలుకోసం ప్రత్యేకంగా సేవాసిందు పోర్టల్,గృహజ్యోతి వెబ్ సైట్ అందుబాటులోకి తెచ్చారు. వినియోగదారుడు ఆధార్ , విద్యుత్ కనెక్షన్ నెంబర్‌లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అద్దెదారులైతే రెంటల్ అగ్రిమెంట్ లేదా నివాస రుజుపు పత్రం అందజేయాలి.




## జూపార్కులో చిత్తడి నేలలపై ఫోటో ఎగ్జిబిషన్

**హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో శుక్రవారం చిత్తడి నేలల దినోత్సవం జరిగింది.ఈ సందర్భంగా జూపార్కులో ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.జంటనగరాలలోని వివిధ పాఠశాలలు,కళాశాలలకు చెందిన 650 మంది విద్యార్థులు జూపార్కులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థులకు చిత్తడి నేలలు, జూపార్కులోని పక్షులు, జంతువులు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్‌ఓ డాక్టర్ సునీల్ ఎస్.హీరామత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.** (ప్రభాతవార్త - చార్మినార్)

## జోమాటో డెలివరీ బాయ్ అరెస్టు

### 1.8 కిలోల గంజాయి స్వాధీనం

గచ్చిబౌలి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : గంజాయి సరఫరా చేస్తున్న ఓ జోమాటో డెలివరీ బాయ్‌ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 1.8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఐటి కారిడార్ పరిధిలోని రాయదుర్గంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గచ్చిబౌలి పరిధిలోని అంజయ్య నగర్‌లో గల ఓ ప్రైవేటు హాస్టల్‌లో నివాసం ఉంటున్న యు.నవీన్(28) జోమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయించసాగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి మిగతా సిటీ 3వ పేజీలో

## 6, 7 తేదీలలో రవీంద్రభారతిలో జాతీయ నృత్యోత్సవం

సైఫాబాద్, ఫిబ్రవరి ప్రభాతవార్త: కళాకృతి నృత్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీలలో యాదాద్రి నృత్యోత్సవం పేరిట రవీంద్రభారతిలో జాతీయ నృత్యోత్సవంను నిర్వహిస్తున్నామని కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపక ప్రిన్సిపల్ ఎం.భారతి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఉత్సవ సంచాలకురాలు భారతి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశ్రీ సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందిన సుప్రసిద్ధ నాట్య నిపుణులతో నిర్వహించే రాయన్ కూచిపూడి, ఒడిస్సాకు చెందిన మల్కామ్ ఫోక్ డ్యాన్స్ బృంద ప్రదర్శన ఉంటాయని, అనంతరం కేరళకు చెందిన చిత్ర సుకుమారన్ మోహిని యట్టం, న్యూఢిల్లీకి చెందిన అను, కాస్మాలి బృందం జానపద నృత్యాలు ఉంటాయని ఆమె తెలిపారు. 7వ తేదీ న న్యూఢిల్లీకి చెందిన భారతిశివాజీ మోహని యట్టం, తమిళనాడుకు చెందిన మాదవపెద్ది మూర్తి బృందంచే కూచిపూడి నృత్యం, ఒరిస్సాకు చెందిన సుజాత మహాపాత్ర వంటి ఉద్దండుల ప్రదర్శనలు కొనసాగుతాయని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభా ప్రహ్లాద్‌కు యాదాద్రి జీవన సాఫల్య పురస్కారాన్ని మంత్రి చేతులమీదగా అందజేయనున్నారని ఆమె తెలిపారు.

## హైదరాబాద్ ఛాప్టర్ చైర్ పర్సన్‌గా హిమవిద్యా సనగవరపు ఎన్నిక

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ మేనేజింగ్ కమిటి చైర్ పర్సన్‌గా సిఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్) హిమా విద్యా సనగవరపు ఎన్నికైనారు. హిమాయత్‌నగర్‌లోని సిఎంఏ భవన్‌లో ఈ ఎన్నిక జరిగింది. ఆమెకు పేరోల్‌తో సహా ఫైనాన్షియల్ అకౌంటింగ్, కాస్టింగ్, టాక్సేషన్‌పై రెండు దశాబ్ధాలుగా అనుభవం ఉంది. వివిధ సంస్థలు స్వతంత్ర ంగా నిర్వహించే అంతర్గత ఆడిట్‌లు, హెచ్‌ఆర్ ఆడిట్‌లలో నైపుణ్యం కలదు. గత పదేళ్ళుగా కాస్ట్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్‌లో ఉన్నారు. ఎన్జీవోలలో ఆమె చురుకుగా పాల్గొంటున్నారు. ఇతర ఆఫీస్ బేరర్లుగా వైస్-చైర్ పర్సన్‌గా సీఎంఏ లావణ్య కందూరి, కార్యదర్శిగా సీఎంఏ ఖాజా జిలాల్, కోశాధికారిగా సీఎంఏ డి.వెంకటరామ్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా సీఎంఏ సీఎస్ కీర్తి అగర్వాల్, సీఎంఏ ఎన్. గణేష్, సీఎంఏ ముసునూరి బాలకృష్ణ, సీఎంఏ ఎల్.ఎన్.శృతి కనిగల్పుల, సీఎంఏ ఈవి ఉషారాణి ఎన్నికైనారు.

## 30 సంవత్సరాలకే క్యాన్సర్

### గుండెపోటు తర్వాత స్థానం క్యాన్సర్‌దే

### పడగ విప్పుతున్న మహమ్మారి

### కాస్త ఆలోచించకపోతే ప్రమాదకర వ్యాధి రావొచ్చు



హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : క్యాన్సర్ పడగ విప్పుతోంది.అభివృద్ధి చెందుతున్న సమాజంలో క్యాన్సర్ కల్లోలం సృష్టిస్తోంది. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ క్యాన్సర్ విస్తరణ వేగమూ అదేస్థాయిలో పెరుగుతోంది.క్యాన్సర్ బారినపడ్డ తరువాత చికిత్స చేయడంకన్నా అది దరికిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే అత్యుత్తమమైన పని. జీవన పరిస్థితులు, కల్తీ ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి వంటివి ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తాయి. క్యాన్సర్ ముందుగా గుర్తించడం సాధ్యంకాదని ఇప్పటికే చాలా మంది అపోహపడుతుంటారు. అది ఎంతమాత్రమూ నిజంకాదని వైద్యులు పేర్కొంటున్నారు. చాలా రకాల క్యాన్సర్లను తొలిదశలోనే పసిగట్టవచ్చు. ప్రజల్లో అవగాహన పెరగడం నేటి తక్షణావసరం. కొన్ని రకాల క్యాన్సర్లను మాత్రం తొలిదశలోనే గుర్తించడం కుదరదు. రొమ్ము, గర్భాశయ, చర్మ, నోటి, పేగు సంబంధ క్యాన్సర్లను చాలా మందుగానే గుర్తించడం సాధ్యమవుతుంది. లక్షణాల ప్రాతిపదికన ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స సులభమవుతుంది. మద్యపానం, పొగాకు సేవవనం వంటి అలవాట్ల వల్ల కలిగే దుష్ఫలితాలను విరివిగా ప్రచారం చేయడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవశ్యకత పట్ల అవగాహన పెంచితే క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించవచ్చు. ఊపరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 71 శాతం ధూమపానం అలవాటు ఉన్నవాళ్లే. క్యాన్సర్ మరణాల్లో 22 శాతానికి పొగాకు సేవనమే కారణమవుతోంది. గుట్కా, పాన్ మసాలాలు, తంబాకు లాంటి వాటిని విచ్చలవిడిగా నమలడం..గంటల తరబడి నోట్లో పెట్టుకోవడంతో చాలా మందికి నోట్లో తీవ్రమైన అస్సర్లు కన్పిస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో 2-5 ఏళ్లలో నోటి, హెడ్ అండ్ నెక్ క్యార్సర్ల కింద రూపాంతరం చెందే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవగాహన లేమితో పొగాకు ఉత్పత్తులను వాడుతూ వారికి తెలియకుండానే బానిసలవుతున్నారు. ముఖ్యంగా బాధితుల్లో అధిక శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో 40 శాతం నోటి, హెడ్‌అండ్ నెక్‌లతో బాధపడుతున్నారని అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. యువత ఎక్కువ మంది గుట్కా, పాన్ మసాలాలు,, జర్దా లాంటి వాటిని అధికంగా తీసుకుంటున్నారు. కల్తీ ఆహారం, కల్తీ నూనెతో తయారు చేసే వంటలు వంటి వాటిని మానేయడం చాలా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నోట్లో దీర్ఘకాలంగా పుండ్లు, తెల్లమచ్చలు లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. నోరు తెరవడం, గుటక వేయడం కష్టంగా ఉండటం, ఆహారం తీసుకుంటే మింగనివ్వకపోవడం, గొంతు బొంగురు పోవడం లాంటి లక్షణాలు కన్పిస్తే తక్షణం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలంటున్నారు. ముందే గుర్తించడంతో నోటి క్యాన్సర్లను పూర్తిగా నివారించవచ్చు. చాలా మంది 2-3 దశలు దాటిన తర్వాత చికిత్సకు వస్తున్నారని, ఇలాంటి సమయాల్లో నియంత్రణ అనేది కష్టమని చెబుతున్నారు. సుదీర్ఘంగా పిప్పి పళ్లతో నోటి గోడలకు ఇన్‌ఫెక్షన్లు లాంటివి వస్తే అశ్రద్ధ చేయకూడదని వైద్యులు పేర్కొంటున్నారు.ఏటా ఈ మహమ్మారి కేసులు, మరణాలు చాప కింద నీరులా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గాడితప్పిన జీవనశైలి కారణంగా కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయని వివరిస్తున్నారు.

#### 30 ఏళ్ళ వారిని వదలని మహమ్మారి

ప్రపంచంలో మరణాలకు దారితీసే అతి ముఖ్య కారణాల్లో గుండెపోటు తర్వాతి స్థానం క్యాన్సర్‌దే. గతంలో 50 ఏళ్ళు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం 30ఏళ్ళ వారిని వెన్నాడుతోంది. మిగతా సిటీ 3వ పేజీలో

## ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల సమాహారం హరికథ కళ

### తెలంగాణ విద్యా, బిసి సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



ఉమామహేశ్వరి, కళాకృష్ణ దంపతులను సన్మానిస్తున్న బుర్రావెంకటేశం

నాంపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వెల్లివిరిసే సమాహార ప్రాచీన కళల్లో ఒకటైన హరికథను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ విద్యా, బిసి సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. కేంద్రప్రభుత్వం సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఒకేఒక్క భాగవతారిణి దాలిపర్తి ఉమామహేశ్వరిని గుర్తించి ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం హర్షదాయకమని వెంకటేశం కొనియాడారు. ప్రణవ్ కూడిపూడి నృత్యశిక్షణాలయం ఆధ్వర్యంలో ఇటీవల కేంద్రం పద్మశ్రీ ప్రకటిత భాగవతారిణి డి. ఉమామహేశ్వ రికి ఘనంగా అభినందన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి బుర్రా వెంకటేశంతో కలిసి పలువురు ప్రఖ్యాత నృత్యకళాకారులతో కలిసి ప్రముఖ నాట్యగురువు డా. కళాకృష్ణ సతీమణి మరో పద్మశ్రీ కళాకారిణిని ఉమామహే శ్వరిని ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా విరివిగా హరికథగాన కార్యక్ర మాలు నిర్వహించే విధంగా తనవంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఈ వేడుకల్లో పద్మశ్రీ పద్మజారెడ్డి, డా. కళాకృష్ణ, డా. పసుమర్తి రామలింగశాస్త్రి, డా. కోట్ల హనుమంతరావు, డా. ఎస్పీ భారతి, డా. వనజా ఉదయ్, డా. రమాదేవి, డా. భాగవతుల సేతూరామ్, అంజుబాబు, సీనియర్ సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ పాల్గొన్నారు. సభకుముందు పద్మజారెడ్డి శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది.

## పేదల పథకాల అమలులో ప్రభుత్వాల విఫలం

- కార్పొరేట్‌లకు రుణాలను మాఫీ చేసి పేదలకు అన్యాయం చేస్తున్న మోడీ బడ్జెట్
- విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ




ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కేంద్ర బడ్జెట్ అబద్దాల పుట్ట అని, కార్పొరేట్‌లకు 25లక్షలకోట్ల రుణాలను మాఫీ చేసి పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా ప్రజాబడ్జెట్ అని, అబద్దాలు ఆడుతు మిగతా సిటీ 3వ పేజీలో



నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి వర్షినీ సుందర్‌రాజన్

## బిఆర్ఎస్ పార్టీ భవన్‌ను ముట్టడిస్తాం

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ రథ సారధి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ లేకపోతే కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యేవారు కాదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్పష్టం చేసింది. తెలంగాణ ఉద్యమానికి కోదండరామ్ ఊపరి పోశారని, ఎన్నో ఉద్యమాలకు శ్రీకారం చుట్టారని, టి-జెఎసి పేరిట అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను, యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చారని, ఇలాంటి నాయకుడిపైన బిఆర్ఎస్ పార్టీ కుట్రలు చేస్తున్నదని ఫోరం ఆరోపించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ కోదండరామ్ వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, కవిత, సంతోష్ తదితరులకు పదవులు లభించాయని, కెసిఆర్ ఒక్కడి వల్లనే తెలంగాణ రాలేదని, ఆ భ్రమల్లోంచి భయటకు రావాలని, తెలంగాణ ఉద్యమ కారులను విస్మరించి, ఆహంభావంతో దశాబ్ధకాలంగా పాలించిన కెసిఆర్‌కు ఆహంకారానికి తెలంగాణ ఉద్యమ కారులు తగిన గుణపాఠం చెప్పారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, లాలయ్య, వీరాస్వామి, ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.సత్యారెడ్డి

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ సూచించిన విధంగా హైదరాబాద్ నగరాన్ని దేశానికి రెండోవ రాజధానిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని తెలుగు సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు పి.సత్యారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రకటించేంతవరకు తాము ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన కలిసి వచ్చే పార్టీలు, వివిధ సంస్థలతో కలిసి ఇందిరాపార్కు ఎదుట, ధర్నా, నిరాహారదీక్ష చేపడతున్నామని చెప్పారు. అలాగే మార్చి మాసంలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేపటడతామని హెచ్చరించారు. దేశానికి హైదరాబాద్ నగరాన్ని రెండోవ రాజధానిగా చేయడానికి అన్ని అర్హతులు ఉన్నాయని స్పష్టం చేశారు. విభిన్న భాషలు, సంస్కృతులకు నిలయమై 4 దశాబ్ధాలకు పైగా చరిత్ర కలిగిన హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో, దేశ రక్షణ దళాలు, మంచి వాతావరణ కలిగి యున్నదని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జగదీష్‌రెడ్డి, గొట్టిపాటి కృష్ణాగౌడ్, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి లోక్‌సభ స్థానంనుండి కెటిఆర్ పోటీచేయాలి

**కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్**


మల్కాజిగిరి లోక్‌సభ స్థానం బిఆర్ఎస్ అభ్యర్థిగా కె.టి.ఆర్ పోటీచేయాలంటూ తీర్మాణం చేసిన కూన పారిజాత గౌరీష్‌గౌడ్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో భారత రాష్టసమితి అభ్యర్థిగా కల్వ కుంట్ల తారకరామారావును పార్టీ ఎంపిక చేయాలని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ నాయకత్వం తీర్మాణించింది. రానున్న ఎన్నికల్లో కల్వకుట్ల తారకరామారావు నాయకత్వాన్ని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని కోరుతూ కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్‌గౌడ్ నేతృత్వంలో ఏకగ్రీవతీర్మాణం చేయడంతో పాటు బిఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గపరిధిలో 85,576 వేల మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు అబినందలు తెలిపారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకంటే ఎక్కువ మెజార్టీతో లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా కల్వకుంట్ల తారకరామారావును గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిపలరు ఇందుకూరి సూర్యప్రభ, డివిజన్ టిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కిశోర్‌చారి, సంజీవరెడ్డి, నార్లకంటి బాలయ్య, యాదగిరి(బాపు) తదితరులు పాల్గొన్నారు.

### మాజీ సిఎం ఠాకూర్‌కు భారత రత్న

## అవార్డు ఇవ్వడం హర్షనీయం : పిట్ల నాగేశ్


నరేంద్ర మోడీకి పాలభిషేకం చేస్తున్న నాయిబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ఓబిసి నేత పిట్లనాగేశ్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: బిహార్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కర్పూరీ ఠాకూర్‌కు నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించడం హర్షనీయమని బిజెపి ఓబిసి రాష్ట్ర నాయకుడు పిట్ల నాగేశ్ హర్షం వ్యక్తం చేశారు. బిసీ నాయిబ్రాహ్మణ కులానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ సేవలను గుర్తించి అణగారిన వార్గానికి చెందిన మాజీ సిఎంకు భారత రత్న అవార్డు ప్రకటించినందుకు శుక్రవారం కంటోన్మెంట్ 5వ వార్డులోని మహేంద్రహిల్స్ చెక్ పోస్టు వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బిజెపి నాయకులు జగన్ మోహన్ ముదిరాజ్, ప్రేమ్, రాజ్‌గోపాల్, వీరవర్ధన్ గౌడ్, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు హన్మంత్, తిరుమలేశ్, భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే కేంద్ర బడ్జెట్

**టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం**

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: బడ్జెట్ ఆద్యంతం రాజకీయ ఉపన్యాసాన్ని తలపించిందని ఓట్ ఆన్ బడ్జెట్ కాదు ఓట్ల బడ్జెట్ అని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలోని పెండింగ్ ఆంశాల గురించి, పారిశ్రామిక పార్కుల కేటాయింపు, సింగరేణి ఐటీ హైదరాబాద్, మనుగూరు ప్లాంట్లకు నిధుల కేటాయింపు గురించి ఏ మాత్రం ప్రస్తావన లేనేలేదని అసలు తెలంగాణ ఊసేలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై మరోసారి వివక్షతను చాటుకుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు ఎప్పటిలాగే మొండి చేయి చూపించిందని కేవలం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం కోసం మాత్రమే బడ్జెట్ ప్రసంగాన్ని వాడుకున్నారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ నిరాశ, నిస్పృహలతో కూడుకున్నదని, బడ్జెట్‌లో సామాన్యుడికి మొండి చెయ్యి చూపారన్నారు. బడ్జెట్ ప్రసంగం సొంత డబ్బులా ఉందని, పదేళ్ళలో అది చేసాం ఇది చేసాం అని లేనిపోని గొప్పలు చెప్పుకునే ప్రయత్నం తప్ప ఏమి లేదన్నారు. ఆద్యంతం రాజకీయ ఉపన్యాసాన్ని తలపించిందన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా బహాదూర్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం(03-02-2024) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి ఇందిరమ్మకాలనీ ఫీడర్ పరిధిలోని బహాదూర్‌పల్లి గ్రామం, ఇందిరమ్మకాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 12గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహాకరించాల్సిందిగా ఏఈ కోరారు.

**మైలార్‌దేవ్‌పల్లి..** ఉప్పర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 3వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు ఫోర్చూన్ కాలనీ,ఫార్మర్ రెడ్డి హిల్స్,జనచైతన్య ఒకటి,రెండు,గోల్డెన్ హైట్స్,హ్యాపీ హోమ్ కాలనీ,జలాల బాబానగర్, నౌనెంబర్,240 చింతల్ మెట్ చౌరస్తా,హెచ్‌హెచ్‌ఫోర్చూన్,హరినాథ్ రెడ్డి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజేంద్రనగర్ ఆఫరేషన్ ఎఇ హాతిరాం తెలిపారు.

నిజాంపేట్.. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించే కార్యక్రమంలో భాగంగా 11కేవీ వికాస్ ఫీడర్‌లో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు డెవలపర్స్, ఎన్ఆర్, కౌసల్య కాలనీ అలాగే..11కేవీ వోల్వో ఫీడర్‌లో మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు రేణుకా యల్లమ్మ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంత కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

### కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: నాలా కల్వర్టు నిర్మాణ పనునలు వేగవంతంగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుండి మాధవరం కాలనీ వైపు వెళ్ళే రహదారిలో రూ. 90 లక్షల వ్యయంతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం అరికెపూడి గాంధీ కార్పోరేటర్ రోజాదేవి రంగారావు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.




గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదుచేస్తున్న సిపిఐ కార్యదర్శి ఉమమహేశ్, శ్రీనివాసనగర్ నాయకులు మురళి, కిరణ్, సంతోశ్, టైసన్, చిన్నా తదితరులు

## బస్తీ కమిటీహాలును కిరాయికి ఇవ్వడంపై నిలదీత

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్టలో ప్రభుత్వానికి చెందిన బస్తీ కమిటీహాలును ప్రైవేటు వ్యక్తులు అద్దెకుఇచ్చారు. ఇదేమిటని అధికారులను ప్రజలు గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్‌ను స్థానికులు నిలదీశారు. భారత కమ్యూనిస్టుపార్టీ కుత్బుల్లాపూర్ కార్యదర్శి ఉమ మహేశ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్‌కు చెందిన బస్తీకమిటీహాలును ప్రైవేటు వ్యక్తులకు స్థానిక నాయకులు అద్దెకు ఇచ్చిన విషయమై గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. తక్షణం ఈవిషయమై విచారణచేసి చర్యలు తీసుకుంటామని ఉపకమిషనర్ మల్లారెడ్డి హామీఇచ్చారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పోటీ ప్రపంచంలో రాణించాలి

**తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య లింబాద్రి**


విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న లింబాద్రి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతోపాటు నేటి పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో గొప్పగా రాణించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య లింబాద్రి కోరారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తపస్య కాలేజీ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ స్నాతకోత్సవ వేడుకులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లింబాద్రి ఓయు పరీక్షల నియంత్రణ అధికారి రాములు, తపస్య ఛైర్మన్ సీఎ ముప్పాల శ్రీధర్ తదితరులతో కలిసి పట్టభద్రులైన 500మంది విద్యార్థులకు పట్టా లను అందజేశారు. సమకాలీన మార్పుకు తగ్గట్టు ఉద్యోగ అవకాశాలు, వ్యాపారానికి కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే విద్యాసంస్థలు మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి కృషిచేయాలని కోరారు.

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను బదలాయించాలి

**మాజీ సర్పంచ్ కావలి గణేష్**


ఏఈ సురేందర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న మాజీ సర్పంచ్ కావలి గణేష్

దుండిగల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ 5వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను బదలాయించి సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఏఈ సురేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం వార్డులో పర్యటించిన ఏఈకి గణేష్ సమస్యలు వివరించారు. ముఖ్యంగా ఇండ్లపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు, రాకపోకలకు అడ్డుగా ఉన్నటువంటి విద్యుత్ స్థంభాలను బదాలయించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈవిషయమై ఏఈ సానుకూలంగా స్పందిస్తూ సమగ్రంగా పరిశీలించి సమస్యను వీలైనంత త్వరితంగా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో దొంతి మహేశ్‌ముదిరాజ్, యాదగిరి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని పలు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆల్విన్ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శరత్ బాబును శుక్రవారం బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి కలిసి వినతిపత్రాన్ని అందిస్తూ సమస్యలను వివరించారు. అందులో ప్రధానంగా రోడ్ నెంబర్ 14సి పార్కు సమీపంలోని గ్రీన్ బెల్ట్ ట్రాన్స్‌ఫర్మర్ నుంచి సరఫరాలో ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయంతో స్థానికులు ఉదయం, సాయంత్రం ఎదుర్కుంటున్న సమస్యను, అదేవిధంగా బస్తీలోని రోడ్డు నెం. 14,17,19 తదితర గల్లీలోని విద్యుత్ స్తంభాలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయని వెంటనే వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని చంద్రారెడ్డి ఏఈని కోరారు. వెంటనే స్పందించిన ఏఈ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐపిఎంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలి

**తెలంగాణ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి**

హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: నారాయణగూడలోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లోని ఐపీఎంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం, ఐపీఎం రాష్ట్ర అధ్యక్షులు జి.మహేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ.నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు మహ్మద్ గౌస్ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు వైద్య, ఆరోగ్య శాఖామంత్రికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐపీఎం, నారాయణగూడలో ల్యాబ్ అటెండెంట్ సత్యనారాయణగౌడ్ గత ప్రభుత్వంలోని మంత్రి అండతో గత పది సంవత్సరాలుగా విధులకు హాజరుకాకుండా, నెలకు ఒకేసారి రిజిస్టర్‌లో సంతకాలు చేసి, జీతం తీసుకుం టున్నాడని ఆరోపించారు. ఒక్కోసారి నెలకు ఒక్కసారి కూడా ఆఫీసుకు రాకుండా ఇంటికే రిజిస్టర్ తెప్పిం చుకుని, సంతకాలు పెట్టి జీతం తీసుకుంటున్నారని, ఇతనికి ఆఫీసులో కొందరు అధికారులు అన్ని రకాలుగా సహకరిస్తున్నారని అన్నారు. ఇతనికి సహకరించటం కోసం మంత్రి అండతో సివిల్ సర్జన్ అయిన శివలీలకు అర్హత లేకున్నా డైరెక్టర్‌ను చేశారని, అదే విధంగా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.ఎం.ఎస్.కే.కుమార్ అక్రమంగా డబుల్ ప్రమోషన్ తీసుకుని సత్యనారాయణకు సహకరిస్తున్నారని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా అక్రమంగా సంపాదిస్తూ మూడు కార్లు, బాడీ గార్డులను సైతం మెయిన్‌టెన్ చేస్తున్నాడని, ఇప్పటికీ అదే విధంగా కొనసాగిస్తున్నాడని అన్నారు. వీరంతా కలసి ఆఫీసులో ఇతర సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సదరు వ్యక్తులపై విచారణ జరిపించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు


అధికారులకు అక్రమ నిర్మాణంపై వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట సర్కిల్ మూసాపేటలో గల ఇంటి నెంబర్ 12-4-73లో జిహెచ్ఎంసి మంజూరు చేసిన అనుమతులకు విరుధ ంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ పేరిట ఉప్పు రామకృష్ణ కూకట్‌పల్లి జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఇంటి నెంబర్ 12-4-73లో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని అక్రమంగా మూడో అంతస్తును నిర్మిస్తున్నారని, రోడ్డును ఆక్రమించి అధిక వైశాల్యంలో భవనాన్ని నిర్మిస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా జరుగుతున్న అక్రమ నిర్మాణం కారణంగా పెద్ద వాహనాల రాకపోకలకు ఈ నిర్మాణం అడ్డుగా ఉందని అన్నారు. కెపిఎం గ్రౌండ్‌లో ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించే వినాయక, దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలకు ఈ అక్రమ నిర్మాణం వలన అంతరాయం కలిగే అవకాశం ఉదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## బోర్‌వెల్‌కు మరమ్మత్తులు


5వ వార్డు సంజీవయ్య నగర్‌లో బోర్‌వెల్ మరమ్మత్తులు చేయిస్తున్న తేలుకుంట సతీష్ టీమ్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్‌లో గత కొన్ని నెలల నుంచి పవర్‌బోర్‌వెల్ పాడైపోవడంతో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త తేలుకుంట ఎసతీష్‌గుప్త టీమ్ ప్రతినిధులు శుక్రవారం మరమ్మత్తులు చేయించారు. దీంతో బోర్‌వెల్ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పలత, మధు తదితరులు పాల్గొన్నారు.

## 4న దివ్యాంగుల సంక్షేమానికి ఉచిత శిబిరం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సైఫాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ప్రముఖ నారాయణ సేవా సంస్థాన్ ఈ నెల 4వ తేదీన దివ్యాంగుల సంక్షేమం కోసం కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఉచిత స్క్రినింగ్ ఎంపిక, నారాయణ లింబ్, కాలిపర్స్ కొలతల శిభిరాన్ని నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులు ఉత్తమ్ దామోరాణి, అల్కాచౌదరి, జస్వత్‌పటేల్, రిద్ధేష్‌జాగీర్‌దార్, అంబేదా చౌదరి తదితరులు ఈ శిభిరానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో చేతులు, కాళ్ళు కోల్పోయి దుర్భరదారిద్ర్యజీవితాన్ని గడుపుతున్న దివ్యాంగులను రక్షించేందుకు తమ సంస్థ గత 39 సంవత్సరాలు నిస్వార్ధంగా సేవలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి చేస్తున్నదని చెప్పారు. ఉదయ్‌పూర్‌కు చెందిన ఈ సంస్థ 1005వ శిభిరాన్ని కింగ్‌కోఠిలో నిర్వహిస్తున్నదని, ఈ శిభిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## ఒకే ఇంట్లో అక్క చెల్లెళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలు

నాచారం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఇటీవల వెలువడిన స్టాఫ్ నర్స్ ఫలితాల్లో మేడ్చెల్ మల్కాజిగిరి వాసులు ఏసుదాసు, సరోజిని దంపతుల ఇద్దరు కుమార్తెలకు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు వరించాయి. నాచారంకు చెందిన బండ నవితరావు, అల్వాల్‌కు చెందిన వవి.నవరత్న కుమారిలు స్టాఫ్ నర్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు.ఈ మేరకు సంబందిత అధికారుల చేతుల మీదుగా జాబ్ లెటర్‌ను తీసుకున్నారు. ఈ మేరకు అక్కా నవరత్న కుమారి, చెల్లెలు నవనిత రావు మాట్లాడుతూ ఎంతో కష్టపడి పరీక్షలు రాశామని కష్టపడితే ఖచ్చితంగా జాబ్ వస్తుందని తమకు నిరుపిత మైందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన అక్కా చెల్లెలిని కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు పలు ప్రాంతాలలో తాత్కలికంగా విద్యుత్ నిలిపివేత

కొంపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : నేడు 11కెవి అపర్ణ ఫీడర్‌లో రీకండక్టరింగ్, మెయింటెనెన్స్, చెట్ల కొమ్మల ట్రీమింగ్ చేయడం వలన పలు ప్రాంతాలలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యుత్ మీటర్‌కు వినియోగదారులు ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవాలి

**మీరాలం ఎడిఇ వెంకటేష్ గౌడ్**



చార్మినార్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : పాతబస్తీలోని విద్యుత్ వినియోగదారులు టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధికారుల ఆదేశాలనుసారం విద్యుత్ మీటర్ సర్వీస్‌కు తమ ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవాలని మీరాలం ఎడిఇ వెంకటేష్ గౌడ్ కోరారు.విద్యుత్ మీటర్‌కు ఫోన్ నెంబర్‌ను లింక్ చేయటం వల్ల చాలా ఉపయోగం ఉందని,విద్యుత్ సరఫరాను నిలిపి వేసే సమయంలో ముందుగా వినియోగదారులకు మెసేజ్‌లు వస్తాయని ఆయన తెలిపారు.వినియోగదారులు విద్యుత్ బిల్లు చెల్లించినచో బిల్లు కట్టినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వస్తాయని ఆయన తెలియజేశారు.పాతబస్తీలోని మీరాలం,అత్తాపూర్,చ oదూలాల్ బారాదరి సబ్ స్టేషన్ల పరిధులలోని విద్యుత్ వినియోగదారులు తప్పకుండ విద్యుత్ మీటర్ సర్వీసెస్‌కు ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవాలని మీరాలం ఎడిఇ వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.మా మీటర్ రీడర్ మీ ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు వినియోగదారులు తప్పకుండ మీటర్ సర్వీస్ నెంబర్,మీ పేరు,ఫోన్ నెంబర్ వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు.వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి తమ సహకారాన్ని అందించాలని ఆయన తెలిపారు.

### వెబ్ సిరీస్‌లో అవకాశం కల్పిస్తానని..

## మహిళపై అత్యాచారం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : వెబ్ సిరీస్‌లో అవకాశం కల్పిస్తానని నమ్మించి మారుతండ్రి యువతిపై అత్యాచారం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలియజేసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఏలూరు ప్రాంతానికి చెందిన జి.కృష్ణారావు నగరంలో లోన్లు ఏజెంట్‌గా పనిచేస్తూ లింగంపల్లిలో ఉంటాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. కృష్ణాజిల్లాకు చెందిన ఓ మహిళ మూసాపేటలో నివాసం ఉంటుంది. ఆమెకు భర్త చనిపోగా కుమారుడు కుమార్తె ఉన్నారు. కృష్ణారావుకు రైలు ప్రయాణంలో ఆ మహిళతో పరిచయం అయింది. 2016లో ఆమెను నమ్మించి పెళ్ళి చేసుకున్నాడు. అనంతరం గొడవలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. అయినప్పటికి అపుడపుడు ఆమె నివాసానికి కృష్ణారావు వస్తుంటాడు. ఈ క్రమంలో తరచూ ఆమె కుమార్తెతో సినిమా, సీరియల్స్ వెబ్ సిరీస్‌ల గురించి చర్చించి అవకాశం కల్పిస్తానని నమ్మించారు. తండ్రికి వరుసయ్యే కృష్ణారావును నమ్మింది. గురువారం రాత్రి స్థానికంగా ఉన్న ఓయో రూములో వెబ్ సీరీస్ డైరెక్టర్ ఉన్నాడని నమ్మించి తీసుకెళ్ళాడు. అనంతరం కూతురు వరసైన ఆమెను అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని ఆ యువతి తల్లికి తెలియజేసింది. శుక్రవారం బాధిత యువతి, ఆమె తల్లి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై అత్యాచారం ఎస్‌సి.ఎస్‌టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడాకారునికి చెక్కు పంపిణీ


బాక్సింగ్ క్రీడాకారుడికి చెక్కును అందచేస్తున్న టిఎన్‌జిఒ అధ్యక్షులు ముజీబ్ హుస్సేనీ

గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 2ప్రభాతవార్త:తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌కు చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు మొహమ్మద్ హుసముద్దీన్‌కు తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ రెండు లక్షలచెక్కును అందచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను డెస్టినీ గ్రూపు ప్రకటించిన విధంగా రెండు లక్షల నగదును చెక్కు రూపంలో అందచేయడం అభినందనీయమన్నారు.అంతేకాకుండా భారత దేశానికి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న దళిత మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా,ఎఇ వేణు

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, SABBANI CHANDRAKANTH S/o Late S. Sanju, R/o H.No.12-2-647, Mandulaguda, Gudimalkapur, Hyd. have changed my father name as SABBANI CHANDRAKANTH S/o Late SABBANI SANJEEVA.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## షాదిముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలతో మహిళలకు ఎంతో మేలు : ఎమ్మెల్యే బలాల



షాదిముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** షాదిముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 111 మంది మహిళలకు షాదిముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల క్రింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బలాల తన కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 మహిళలకు షాదిముబారక్ పథకం ద్వారా, మరో 11మంది మహిళలకు కళ్యాణలక్ష్మి పథకాల ద్వారా మంజూరైన చెక్కులను అందజేయడం జరిగిందని, మొత్తం రూ. కోటి 11 లక్షల 12 వేల 876 చెక్కులను లబ్దిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్, అంబర్‌పేట, చార్మినార్ మండల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.10కోట్ల వ్యయంతో లయన్స్ క్లబ్ నేతృత్వంలో ఆరోగ్య సెంటర్ : విజయరంగా



ప్రకాష్‌రావుని సన్మానిస్తున్న విజయరంగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** నిరంతరం ప్రజలకు అనేక రకాలైన సేవలు అందించాలనే సంకల్పంతో లయన్స్ క్లబ్ నేతృత్వంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య కేంద్రాన్ని భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా పేర్కొన్నారు. రూ.10కోట్ల వ్యయంతో బాటసింగారంలో పావని ప్రకాష్ పేరు మీద హాస్పిస్ పల్లియాటివ్ కేర్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్న ఆయన తెలిపారు. ఆస్పత్రి ఏర్పాట్లకు సహకారం అందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ సిహెచ్.ప్రకాష్ రావుని శుక్రవారం విజయరంగా, కొట్టం జంగయ్యాయాదవ్‌లు కలిసి సత్కరించారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో లైన్స్ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టీహిల్స్, మాజీ అధ్యక్షుడు బ్రియాన్ షిహాన్, వైస్‌అధ్యక్షుడు ఏపీ సింగ్, డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు, మాజీ డైరెక్టర్ రుమాండ్ల సునీల్ ఆధ్వర్యంలో ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్‌లో రూ.8.40 కోట్ల పర్మనెంట్ ప్రాజెక్టు ఒప్పందం కుదుర్చుకొని ఆయన సతీమణి పావని ప్రకాష్ పేరు మీద ఆస్పత్రి ఏర్పాటు చేసి దీర్ఘకాలిక మందులకు లొంగని క్యాన్సర్, గుండె, కిడ్నీ ఫెయిల్యూర్, ఇతర మొండి జబ్బులను నయం చేయడానికి సెంటర్‌ని ఏర్పాటుచేసి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. సామాజిక సేవలో ఇది ఒక అత్యుత్తమైన సేవ అని ఆయన కొనియాడారు.

## వాసవికాలనీలో రేపు ఉచిత వైద్య శిబిరం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిబిరంలో పలు రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## లక్ష్మారెడ్డికాలనీ కమ్యూనిటిహాల్‌లో ఎసిల ఏర్పాటు



ఎసిలు ఏర్పాటు చేస్తున్న కాలనీ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, అర్జున్‌రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఉప్పల్ డివిజన్ లక్ష్మారెడ్డికాలనీ కమ్యూనిటిహాల్‌లో కాలనీ నేతల సహకారంతో ఎసిలను ఏర్పాటు చేశారు. కాలనీ అధ్యక్షుడు మేకల హనుమంతరెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అడ్వయిజర్ గోనె అర్జున్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటిహాల్‌లో సోమవారం ఎసిలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాలనీలో స్వంత నిధులతో భవనం నిర్మించుకుని అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కమ్యూనిటిహాల్‌లో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు తెలిపార. కమ్యూనిటిహాల్‌లో వివిధసాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, యోగా, వైద్య శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీ ప్రజలకు వీటిని అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఐవీఎఫ్ నూతన కమిటీ ప్రకటించిన ఉప్పల



నియామక పత్రాలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నూతన కమిటీని ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రకటించారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులుగా నియామకమైన వారికి నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీ మహిళావిభాగం చీఫ్‌అడ్వైజర్‌గా మణిమాల, జనరల్ సెక్రెటరీగా మంజుల, కోశాధికారిగా జగతి, ఉపాధ్యక్షురాలుగా పావని, సలహాదారులుగా ఎమ్.శైలజ, అనిత, అర్చన, శాంతి ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ నళిని, ఆర్గనైజింగ్ సెక్రటరి వినోద, సరిత, పిఆర్‌ఓగా పల్లవి, తులసిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, పబ్బ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## సమద్‌బిన్ సిద్దిఖీ కుటుంబానికి అండగా ఉంటాం: అమ్జదుల్లాఖాన్



సమద్ బిన్ సిద్దిఖీ కుమారులను పరామర్శిస్తున్న అమ్జదుల్లాఖాన్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** మృతి చెందిన కొత్తపేట్ మాజీ వార్డు సభ్యుడు, మైనారిటీ నేత సమద్ బిన్ సిద్దిఖీ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఎంబిటి (మజ్లీస్ బచావో తెహ్రీక్) పార్టీ వ్యవస్థాపకులు అమానుల్లాఖాన్ కుమారుడైన పార్టీ అధికార ప్రతినిధి, ఆజంపూర మాజీ కార్పొరేటర్ అమ్జదుల్లాఖాన్ స్పష్టం చేశారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన సమద్ బిన్ సిద్దిఖీ కుటుంబ సభ్యులను జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటలో ఉన్న వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిద్దిఖీ కుమారులను, సోదరుడిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. రాజకీయంగా ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న వివాదరహితుడు సమద్ బిన్ సిద్దిఖీ నడి వయస్సులోనే మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆయన మృతి స్థానికంగా తీరని లోటని అన్నారు. అయితే సమద్ కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తెస్తే వాటి అండగా ఉండి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అమ్జదుల్లాఖాన్ హామీనిచ్చారు. సమద్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంబిటి నాయకుడు ముస్తఫా మహమూద్, బిఆర్‌ఎస్ నేతలు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, అంజాద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## బిజెపి గిరిజన, దళితమోర్చా అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపిన శంకర్‌రెడ్డి



అభినందిస్తున్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర నూతన అధ్యక్షునిగా నియమితులైన డాక్టర్ కళ్యాణ్, దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌లను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం వారు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలిసిన శంకర్‌రెడ్డి వారిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.మహేశ్, కె.సురేందర్, కె.భాస్కర్, జగన్, కుమార్, మోతీలాల్, హరి, వేణు, కుంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం : కార్పొరేటర్ శ్రీవాణి



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీమని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్‌లో భగవద్గీత గంగాదరశాస్త్రి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉదయం నుంచే రోడ్లపై చెత్తాచెదారం తొలగిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా కార్మికులు ఎంతో సేవ చేస్తారని, వారిని తగు చేయూత అందించడం అభినందనీయమన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసే వారిపై తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల ప్రతి ఒక్కరు చేయూత అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, బాబు రావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## సిఐ ఎలక్షన్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల సత్కారం

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఉప్పల్ సిఐగా నియమితులైన ఎలక్షన్‌రెడ్డిని బుధవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తవిడబోయిన గిరిబాబు, బిక్షపతిచారి, మహబూబ్‌అలీ, బెజ్జం యాదగిరి, రవి, టి.ప్రవీణ్, పబ్బు గణేష్ తదితరులు పాల్గొన్నారు. సిఐ ఎలక్షన్‌రెడ్డి ప్రజలకు తమ వంతు చేయూత అందించాలని వారు సూచించారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్దే తమ ధ్యేయం : అబ్రార్



అజంపురలో పర్యటిస్తున్న ఎంఐఎం నాయకుడు అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** అభివృద్దే తమ ధ్యేయంగా పని చేస్తూ ప్రజల సంక్షేమంకోసం కృషి చేస్తున్నామని అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఫరత్‌నగర్‌లో కొనసాగుతున్న నూతన రోడ్డు నిర్మాణ పనులు, వీధి దీపాల నిర్వహణ, సానిటేషన్ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ది పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ది పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. డివిజన్‌లో ఇప్పటి వరకు పలు అభివృద్ది పనులు చేపట్టడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ది పనులు చేపట్టడానికి వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి అన్ని విధాలుగా అభివృద్ది చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం స్కూల్‌లో మౌలిక సదుపాయాలు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ ఇందిరానగర్‌లోని ఉర్దూ మీడియం స్కూల్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీనేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉర్దూ మీడియం స్కూల్ విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు భోజనం, ఇతర సౌకర్యాలు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అనంతరం స్కూల్ తరగతి గదులు, భోజన వసతి పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, పి.శ్రీకాంత్‌గౌడ్, సాలార్, బోసాని పవన్‌కుమార్, సూరం శంకర్, మారుతి, అద్వైత్, రామకృష్ణ, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్



శ్రీకాంత్‌గౌడ్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**నాచారం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడుగా బండారం శ్రీకాంత్ గౌడ్ నియమితులయ్యాడు. ఈ మేరకు ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి నియామకపు పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయనకు పరమేశ్వర్ రెడ్డి సూచించారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, సత్తయ్యయాదవ్, బండారి రఘు, భద్రయ్య, వెంకటేష్, నూతల కంటి రాజు, మహేష్ యాదవ్, టోని, ఫ్రాన్సిస్, సిహెచ్ నరేష్, క్రాంతి, అజీమ్, రాజేష్, కుదుస్, కృష్ణ యాదవ్, అశోక్, నరేందర్ యాదవ్, మణికంఠ, ప్రవీణ్ చారి, శ్రీనివాస్ రెడ్డి, బండారి మోహన్, మధు, సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్‌తో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మాజీ సిఎం కెసిఆర్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ మేరకు శుక్రవారం పలువురు పార్టీ నేతలతో కలిసి ఆయన మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసి పలు అంశాలు చర్చించారు. ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉందని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 4వ తేదిన మల్లాపూర్ విఎన్‌ఆర్ గార్డెన్‌లో నియోజవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, పార్టీ నేతలు హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తాను అండగా ఉంటానని, పార్టీ అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## భువనగిరి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసిన మురళీధర్‌రెడ్డి



గాంధీభవన్‌లో దరఖాస్తు అందిస్తున్న మురళీధర్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి భువనగిరి పార్లమెంట్ స్థానంనుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గాంధీభవన్‌లో శుక్రవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ ఉపసర్పంచిగా, కౌన్సిలర్‌గా ప్రజాసేవ చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం తనకు అవకాశం ఇస్తే లోక్‌సభ సభ్యుడిగా పోటీ చేస్తానని అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన అరికెల వేణుగోపాల్ రావును టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం.(ప్రభాతవార్త, సైదాబాద్)

## విద్యుత్ వినియోగదారులు మీటర్లకు సెల్‌ఫోన్ లింక్ చేయండి : ఎడిఇ బాలకృష్ణ

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ మీటర్లకు సెల్‌ఫోన్‌తో లింక్ చేసుకోవాలని ఉప్పల్ ఎడిఇ బాలకృష్ణ కోరారు. విద్యుత్ బిల్లులు సమాచారం ఎప్పటికప్పుడు సెల్ మెసేజ్ ద్వారా అందజేస్తామని, అదే విధంగా విద్యుత్ సమస్య ఏర్పడితే వెంటనే సెల్‌పోన్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. విద్యుత్ అంతరాయం గురించి కూడా ముందుగానే సమాచారం వస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ మీటర్, ఫోన్ నెంబర్ లింక్ చేసిన వెంటనే సమాచారం వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో చేసుకోని వారికి ఇంటికి విద్యుత్ సిబ్బంది వెళ్లి సర్వీస్ నెంబర్ తీసుకుని నమోదు చేస్తున్నారని, వారికి సహకరించాలని ఆయన సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తమను కలిసి ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

## డివిజన్‌లో శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యత: కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీలలో శానిటేషన్ పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం వేయకూడదని కార్పొరేటర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి : బాధిత విద్యార్థులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే 46 జీవో రద్దు చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి రాగానే మాట తప్పాలని చూస్తుందని జిఓ నెంబర్ 46 బాధితులు ఆరోపించారు. కొత్తపేటలోని విఎం హోమ్‌లో శుక్రవారం వారు 46 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, రానున్న రెండు, మూడు రోజుల్లో జిఓ 46 బాధితులకు అనుకూల ప్రకటన ప్రభుత్వం నుండి రాకపోతే రాష్ట్ర మంత్రుల ఇళ్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నిలబడిన అభ్యర్థిని ఓడిస్తామని ప్రకటించారు. మా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తుందో మాకు అర్థం కావడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో మహేష్, అనిల్, నవీన్, ప్రవీణ్, ఆకాష్, శంకర్, మధు, వెంకట్, రాముడు, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాళాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** నాళాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చొరవ చూపాలి గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ రోడ్‌నెంబర్ 4లో జరుగుతున్న నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ శుక్రవారం జిహెచ్‌ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మురికి కాలువలు, నాళాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఎంత వర్షం వచ్చినా వర్షపు నీరు వల్ల ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, కమలానగర్ కాలనీ వాసులు సివి.సత్యనారాయణ, మహేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌చారీ, రఘునందన్‌జోషి, టీంకు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎసిపి శ్రీనివాస్‌రావు, సిఐ నాగుల అశోక్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ట్రాఫిక్ ఎసిపి ఎస్.శ్రీనివాస్‌రావు, సిఐ నాగుల అశోక్, ఘట్‌కేసర్ సిఐ కృష్ణంరాజు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, విధిగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణం చేయవద్దని కోరారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడరాదని, ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.సునీత, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం సకాలంలో నిర్వహించాలని, జిహెచ్‌ఎంసిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సెక్రెటేరియట్‌లోని ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ తెలిపారు. (హైదరాబాద్, ప్రభాతవార్త)